RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్
దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 132 | గురువారం
ఏప్రిల్ 17, 2025 | పేజీలు : 4
వెల : రూ.3-00



**యువత ఉద్యోగాల కల్పన దిశగా ఉద్యమించాలి**

4లో..

## సీఎం రేవంత్ రెడ్డి



# పోలీస్ పనితీరు దేశంలో అగ్రస్థానం..!

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి:**

తెలంగాణ పోలీసు శాఖ దేశంలోనే పనితీరులో అగ్రస్థానంలో నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ యావత్ పోలీసు సిబ్బందికి అభినందనలు తెలిపారు. 'ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025' ప్రకారం, కోటి కంటే ఎక్కువ జనాభా ఉన్న 18 రాష్ట్రాలలో పోలీసింగ్ విషయంలో తెలంగాణ పోలీసు శాఖ మొదటి స్థానంలో నిలిచిందన్నారు.

టాటా ట్రస్ట్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్, కామన్ కాజ్ వంటి ప్రఖ్యాత సంస్థలు రూపొందించిన ఈ నివేదికలో తెలంగాణకు గొప్ప గుర్తింపు దక్కడం రాష్ట్ర పోలీసుల కృషికి దక్కిన గౌరవమని అవిప్రాయపడ్డారు.

ఈ ఘనత రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని చెప్పారు. శాంతిభద్రతలు కాపాడడం, నేరాలను నియంత్రించడం, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసుల నమోదులో పారదర్శకత చూపడం ద్వారా తెలంగాణ పోలీసులు రాష్ట్రంలో శాంతి, న్యాయం నిలబెట్టడంలో విజయవం తమయ్యారని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

రాజీలేని కర్తవ్య నిర్వహణతో పోలీసులు ప్రజల్లో నమ్మకాన్ని పెంచారని, ప్రజా పాలనలో ఈ విజయం పోలీసు శాఖ సమిష్టి కృషి ఫలితమని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి విజయాలను తెలంగాణ పోలీసులు సాధించాలని ఆయన ఆకాంక్షించారు.





# బాంచన్ మీ కాళ్లు మొక్కుతా..!

- నా కొడుకు జాడ జర వెతికి పెట్టండి
- పోలీసులకు యువకుడి తల్లి వేడుకోలు
- మాతృమూర్తి బాధ ఖాకీలకు కనిపించడం లేదా? అంటూ ఆవేదన
- ఫిర్యాదును ఖాకీలు పట్టించుకోవడం లేదని ఆరోపణ

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి:**

'బాంచన్ మీ కాళ్లు మొక్కుతా.. సారు.. నా కొడుకు జాడ జర వెతికి పెట్టండి' అని పోలీసులను ఓ తల్లి దీనంగా వేడుకుంటోంది. తన తనయుడు కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేసినా ఖాకీలు

మిగతా 4వ పేజీలో..



## రాజీవ్ యువ వికాసాన్ని సాధారణ సంక్షేమ పథకంగా చూడొద్దు

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**వేద న్యూస్, హైదరాబాద్ :**

రాజీవ్ యువ వికాసాన్ని సాధారణ సంక్షేమ పథకంగా చూడవద్దని బ్యాంకర్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. మానవీయ కోణంలో రూపొందించిన ఈ పథకానికి బ్యాంకర్లు సహకరించాలని అన్నారు. ప్రజా భవన్‌లో రాజీవ్ యువ వికాసం పథకంపై బ్యాంకర్లతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం రాష్ట్రంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచిపోతుందని అన్నారు. స్వయం ఉపాధి పథకాలకు ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎన్నడూ ఇంత పెద్ద మొత్తంలో కేటాయించలేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. కొలువుల కోసం కోరి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో, గత పది సంవత్సరాలుగా నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదని తెలిపారు. ఓవైపు ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తూనే నిరుద్యోగుల కోసం స్వయం ఉపాధి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని అన్నారు. రాజీవ్ యువ వికాసం ద్వారా ఆర్థికంగా, సామాజికంగా యువతకు సహాయపడేందుకు బ్యాంకర్లు సహకరించాలని కోరారు. రాజీవ్ వికాసం ద్వారా రాష్ట్రంలో సంపద సృష్టించబడుతుందని, ప్రభుత్వం రూ.6 వేల కోట్లు ఖర్చు చేస్తుందని, బ్యాంకర్లు రూ.1,600 కోట్లు లింకేజీ ఇచ్చేందుకు ముందుకు రావాలని కోరారు. లబ్ధిదారులకు వ్యాపారాలు చేసుకునేందుకు, లాభాలు పొందడానికి 3 నుంచి 15 రోజుల పాటు శిక్షణ ఇస్తారని డిప్యూటీ సీఎం తెలిపారు. జిల్లా స్థాయిలో కలెక్టర్లు బ్యాంకర్లతో త్వరలో సమావేశం నిర్వహించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

ప్రభుత్వ వాటా విడుదల కాగానే బ్యాంకర్లు లింకేజీ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్థిక, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, శ్రీధర్, శరత్, బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్యే,కలెక్టర్

**వేద న్యూస్, వరంగల్ :**



గీసుకొండ మండల కేంద్రంలో దౌడు సంపత్ రాజకుమారి సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో జిల్లా కలెక్టర్ సత్య శారద, అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి భోజనం చేశారు. ఇంటి యజమానులు వీరి ఆతిథ్యానికి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం సన్న బియ్యం పథకాన్ని ప్రవేశ పెట్టి సాధారణ కుటుంబం కూడా సన్న బియ్యని రోజువారీ ఆహారంగా తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోగలుగుతున్నామని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం లబ్ధిదారులకు ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సన్నబియ్యం పంపిణీ చారిత్రాత్మకమైన నిర్ణయమని,సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో భోజనం చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. పేదలు సన్నబియ్యం తినాలనే లక్ష్యంతోనే సన్నబియ్యం పథకం ప్రారంభించినట్లు చెప్పారు. సన్నబియ్యం సరఫరాలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. త్వరలో ఇందిరమ్మ అభయస్తం పేరుతో 9 రకాల సరుకుల కిట్లను పంపిణీ చేయబోతున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో గీసుకొండ తహసిల్దార్ రియాజుద్దీన్, డిఎం సివిల్ సప్లై సంధ్యారాణి, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

**వేద న్యూస్, వరంగల్ క్రైమ్ :**

రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసివున్న దిచక్ర వాహనాలే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న నిందితుడుని హసన్‌పర్తి పోలీసులు అరెస్టు చేసారు. నిందితుడి నుండి సుమారు 10లక్షల విలువ గల 18 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి కాజీపేట ఏసిపి తిరుమల్ వివరాలను వెల్లడిస్తూ బుధవారం ఉదయం హసన్‌పర్తి పోలీసులు హసన్‌పర్తి మండల కేంద్రంలో వాహన తనీఖీలు నిర్వహిస్తున్న సమయంలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తి పోలీసులు నిర్వహిస్తున్న తనీఖీలను గమనించి అక్కడి నుండి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద ద్విచక్ర వాహనానికి సంబంధించి ఎలాంటి అధారాలు లేకపోవడం పోలీసులు నిందితుడుని విచారించగా జనగామ జిల్లా, చిలుపూర్ మండలం, ఫతేపూర్ గ్రామం, ప్రస్తుతం హనుమకొండ, గోపాల్‌పుర్‌లో నివాసం వుంటున్న గుగులోత్ చందు లాల్ (24), గత కొద్ది రోజులుగా తనకు డ్రైవింగ్ లైసెన్స్ లేనందున స్నేహితుడి లాగిన్ ఐడీతో జోమాటో,స్విగ్గీ,ర్యాపిడో సంస్థల్లో పనిచేస్తున్నాడు. వీటీ ద్వారా వచ్చే అదాయం తన



జల్సాలకు సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. ఇందుకోసం రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను చోరీ చేసి వాటిని విక్రయిస్తే వచ్చే డబ్బు జల్సాలు చేయాలకున్నాడు నిందితుడు. తాను అనుకున్న ప్రకారం హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 7,హసనపర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 3,కెయూసి పరిధిలో ఒక ద్విచక్ర వాహనాన్ని చోరీ చేయడంతో పాటు నిందితుడు రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఉప్పల్ పరిధిలొ4, భువనగిరిలో2, హైదరాబాద్‌లో 1చోప్పున మొత్తం 18 ద్విచక్ర వాహనాలను చోరీ చేసాడు. నిందితుడు చోరీ చేసిన వాహనాలను అవకాశం చూసుకోని విక్రయించేందుకు తన భద్రపర్చుకున్నాడు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు చోరీ అయిన ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లుగా ఏసిపి వెల్లడించారు. నిందితుడిని పట్టుకొని చోరీకి గురైన వాహనాలను తిరిగి స్వాధీనం చేసుకోవడంలో ప్రతిభ కనబరిచిన సెంట్రల్ జోన్ డిసిపి షేక్ సలీమ్, ఏసిపి తిరుమల్, హసన్‌పర్తి ఇన్స్పెక్టర్ చేరాలు, ఎస్.ఐలు దేవేందర్,రవి, సిద్దయ్యలు, ఏఏఓ సల్మాన్ పాషా, హెడ్ కానిస్టేబుల్ వివేకనంద, కానిస్టేబుళ్ళు క్రాంతికుమార్,తిరుపతయ్య, భరత్‌కుమార్, దేవేందర్, మహేందర్, రమేష్, పూర్ణచారీ,రాజ్‌కుమార్,సొమన్న,ధనుంజయ,నాగరాజు,నవీన్‌లను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.



### ఒడిస్సాలో నైనీ బొగ్గు తవ్వకాలు

## అభినందనీయం

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రత్యేక ప్రతినిధి :**

ఒడిస్సాలోని నైనీ బ్లాక్‌లో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వకాలు చేపట్టడం అభినందనీయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దాదాపు 130 ఏళ్లుగా తవ్వకాలు సాగిస్తూ రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న తెలంగాణ సింగరేణి రాష్ట్రం బయట ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాకులో తవ్వకాలు ప్రారంభించి భవిష్యత్తు తరాలకు బంగారు బాటలు వేసిందని పేర్కొన్నారు. ఒడిశాలోని అంగుల్ జిల్లాలో సింగరేణి సంస్థ తనకు కేటాయించిన బొగ్గు గనులకు అన్ని అనుమతులు సాధించి అందులో తవ్వకాలు ప్రారంభించడం శుభ పరిణామంగా పేర్కొన్నారు. ఇది తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే సందర్భమని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సింగరేణి సంస్థకు అభినందనలు తెలియజేశారు.



## హత్య కేసులో నలుగురు నిందితులు అరెస్ట్

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

జిల్లా కేంద్రంలో రామగిరి గీతాంజలి అపార్ట్మెంట్ గీతాంజలి కలర్ ల్యాబ్‌లో జరిగిన దారుణమైన సురేష్ హత్య కేసు నిందితులను

మిగతా 4వ పేజీలో..

### చలివేంద్రం ప్రారంభించిన

# లేబర్ అధికారి కృష్ణ సాగర్



**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**

జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణం పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తా వద్ద తెలంగాణ భవన ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్వో ఆర్ శ్రీనివాస్ హాజరైయ్యారు. ఈ సందర్భంగా లేబర్ అధికారి కృష్ణ సాగర్ మాట్లాడుతూ వేసవికాలం రిత్యా నేటి నుండి మే 31 తారీకు వరకు ప్రజల సౌకర్యార్థమై పాత బస్టాండ్ కూడలి వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు,వ్యవసాయదారులు, ఇతర నిర్మాణ కూలీలు ప్రతి ఒక్కరికి దాహార్తి తీర్చేందుకు అందుబాటులో ఉండే విధంగా చలివేంద్రం ఏర్పాటు చేశామని అన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఐటియుసి నాయకులు ముక్రం మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం లాగే ఈ వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

### బార్ అసోసియేషన్

# ప్రధాన కార్యదర్శి రవికి ఘన సన్మానం



**వేద న్యూస్, కాజీపేట :**

హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన కాజీపేట వాస్తవ్యులు కొత్త రవికి కాజీపేట బీజేపీ నేతలు బుధవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా బిజెపి హనుమకొండ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్ మాట్లాడుతూ కాజీపేటలో ఇంతవరకు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీగా ఎవరూ ఎన్నిక కాలేదనీ, మొదటి సారిగా ఎన్నికైన బార్ అసోసియేషన్ అందరికీ శుభాకాంక్షలు తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం, బిజెపి హనుమకొండ జిల్లా అధికార ప్రతినిధి చాంద్ పాషా, సీనియర్ నాయకులు యాదవ రెడ్డి, మైనార్టీ జిల్లా నాయకులు జాఫర్, గణేష్, భగవాన్దాస్, జీవన్, ప్రకాష్, ఎండి అలిమ్, చిరంజీవి, ఎన్ఐటి రవి, అంబాల శ్రీనివాస్, రామిల్ల శీను, సీనియర్ నాయకులు నాయిని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలను కంటికి రెప్పలాగా కాపాడుకుంటాం



**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

కార్యకర్తలను కంటికి రెప్పలాగా కాపాడుకుంటామని.. ప్రజలకు నిత్య అందుబాటులో ఉంటానని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు అన్నారు.బుధవారం వరంగల్ ఓసి లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లో ప్రజల నుంచి వినతులను విజ్ఞప్తులను స్వీకరించారు.ప్రజల సమస్యలను సావధానంగా వింటూ అప్పటికప్పుడే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా కొండా మురళీధర్ రావు మాట్లాడుతూ ఏ సమస్య ఉన్న ప్రజలు ఎవరి వద్దకు వెళ్లి పైరవీలు చేయకుండా నిరభ్యంతరంగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. ఏలాంటి ఆపద సమయంలోనైనా కొండా దంపతుల ఇంటి తలుపులు ఎల్లవేళలా తెరిచే ఉంటాయని, కొండా దంపతులు కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటారని, కార్యకర్తలను,నాయకులను కొండా దంపతులు కంటికి రెప్పలా కాపాడుకొని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారని ఈ సందర్భంగా కొండా మురళీధర్ రావు తెలియజేశారు.

## స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలి



\- నగర మేయర్ గుండు సుధారాణి

**వేద న్యూస్, వరంగల్ :**

స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో ఇండోర్ స్టేడియం ప్రాంతంలో సుమారు రూ.1 కోటి 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను బుధవారం మేయర్ ఆకస్మికగా తనిఖీ చేసి పనులు కొనసాగుతున్న తీరు పట్ల మేయర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులలో జాప్యం సరికాదని మేయర్ అన్నారు. పనులు త్వరితగతిన పుర్తయ్యేలా ఇంజనీరింగ్ అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. స్విమ్మింగ్ ఫూల్ చుట్టు గ్రీనరీ ఏర్పాటు చేయాలని హార్టికల్టర్ అధికారిని మేయర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఓ రమేష్, ఎం హెచ్ ఓ డా.రాజేష్, ఈ ఈ రవి కుమార్, డి ఈ రాజ్ కుమార్, ఏ ఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# విచ్చలవిడిగా గుట్కా విక్రయాలు..!



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

వేములపల్లి మండలంలో పలు గ్రామాలలో కిరాణా దుకాణాలు గుట్కా పాన్ మసాలా దుకాణాలుగా మారాయి. మండలంలో గుట్కా, పాన్ మసాలా విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయి. వ్యాపారులు ఇదే అదునుగా చేసుకొని అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే ఇప్పటికే ప్రభుత్వం గుట్కా, పాన్ మసాలా విక్రయాలు నిషేధించారు. అయినప్పటికీ మండలంలో కొన్ని కిరాణా దుకాణాల్లో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కాగా సంబంధించిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ దందా మూడు పువ్వులు.. ఆరుకాయలుగా కొనసాగుతుంది. హైదరాబాద్ నుండి కొంతమంది వ్యాపారులు రాత్రిపూట భారీగా సరుకు తీసుకువచ్చి వ్యాపారం చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం తెలుస్తుంది. గుట్కా పాన్ మసాలా దందా మండలంలో కొనసాగుతున్నప్పటికీ పోలీసులు నిఘా కరువైందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పోలీసులు యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని అవగాహన కల్పిస్తున్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పోలీసులు పేర్కొన్నప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పోలీసులు ఇప్పటికే అవగాహన సదస్సులు నిర్వహించిన సంఘటనలు కోకోలుగా ఉన్నాయి. అయితే పోలీసుల విజ్ఞప్తులను పట్టించుకోకుండా.. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి అనారోగ్యానికి గురవుతున్నారు. గ్రామాలలో కిరాణా షాపుల్లో గుట్కా పాన్ మసాలా జర్దా ప్యాకెట్లు అందుబాటులో ఉండడంతో యువత ఎక్కువగా ఉపయోగించడంతో క్యాన్సర్ ఇతర అనారోగ్యాలకు బారిన పడుతున్నారు. అంతేకాదు మండలంలో కొంతమంది వ్యాపారులు హైదరాబాద్ నుంచి గుట్కా పాన్ మసాలా,జర్దా ప్యాకెట్లను తీసుకు వచ్చి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్లో గుట్కాలు పాన్ మసాలా వ్యర్థాలకు బాగా డిమాండ్ ఉండడంతో ఎంఆర్పి ధర కంటే అధిక రేట్లకు అమ్మకాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. కాగా మండలంలో కొన్ని కిరాణా దుకాణాలలో పాన్ మసాలా, గుట్కా,జర్దా బహిరంగంగానే అమ్ముతున్న ప్పటికీ పోలీసులకు పట్టింపు లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం నిషేధించిన గుట్కా ఉత్పత్తులు విక్రయాలను పోలీసులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. మండలంలో జరుగుతున్న దందాను పూర్తిగా నిర్మూలించి ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

### కేయూ డాక్టరేట్ సాధించిన

# కానిపర్తి వాసి



**వేద న్యూస్, కమలాపూర్ :**

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కానిపర్తి గ్రామానికి చెందిన పర్లపల్లి శ్రీశైలం కాకతీయ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ పట్టా పొందారు. ఆచార్య పంతంగి వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో నామని సుజనా దేవి రచనలు - అధ్యయనం అనే అంశం పై సుదీర్ఘ పరిశోధన చేసి ఫైనల్ వైవా ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీ తెలుగు విభాగం ఆచార్యులు లావణ్య ఎగ్జామినర్ గా వ్యవహరించగా పర్లపల్లి శ్రీశైలం తన పరిశోధన అంశం పై వైవాను సమర్థవంతంగా పూర్తిచేసుకోవడంతో కాకతీయ యూనివర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్ అధికారికంగా పర్లపల్లి శ్రీశైలం కు డాక్టరేట్ ప్రకటించారు. డాక్టరేట్ అవార్డు పొందడం పట్ల యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ కర్నాటి ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం శ్రీశైలంను అభినందించారు. అలాగే కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి నాయకులు, ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ నాయకులు, బంధుమిత్రులు, స్నేహితులు, గ్రామస్తులు అందరూ కాకతీయ యూనివర్సిటీ నుండి డాక్టరేట్ సాధించినందుకు పర్లపల్లి శ్రీశైలం కు అభినందనలు తెలియజేశారు.

# మార్కెట్లోకి నకిలీ ఫోన్ పే, గూగుల్ పే యాప్స్

**వేద న్యూస్,** ప్రస్తుత కాలంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం బాగా పెరిగినప్పటికీ, సైబర్ మోసాలు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మార్కెట్లోకి ఇటీవల నకిలీ చెల్లింపు యాప్స్ వచ్చాయి. వీటిని చూస్తే నిజంగా ల మాదిరిగానే కనిపిస్తాయి. కానీ నిజానికి ఇవి ఫేక్ చెల్లింపు యాప్‌లు. ఇవి డబ్బు పంపిన తర్వాత నోటిఫికేషన్ పంపించినట్లు చూపిస్తాయి. కానీ చెల్లింపు మాత్రం జరగదు. ఇలాంటి వాటి విషయంలో విక్రేతలు లేదా వ్యాపారులు జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నకిలీ యాప్‌లను ఉపయోగించి అనేక మంది మోసాలకు పాల్పడుతున్నారని వెల్లడించారు. ప్రత్యేకించి చిన్న వ్యాపారులు ఈ మోసాల వల్ల ఎక్కువగా నష్టపోతారని చెప్పారు. ఈ క్రమంలో వినియోగదారులు, వ్యాపారులు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ నకిలీ యాప్‌ల వలలో పడకుండా, అసలైన యాప్‌లను మాత్రమే గుర్తించడంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో డిజిటల్ చెల్లింపుల విషయంలో మోసాలను గుర్తించి, అవగాహన కలిగి ఉండడం చాలా ముఖ్యమని నిపుణులు సూచించారు.




# రైల్వే సంచలన నిర్ణయం

**వేద న్యూస్,** ముంబై: యూపీఐ పేమెంట్స్ పెరగడంతో.. జేబులో డబ్బులు తీసుకెళ్లేవారి సంఖ్య చాలా వరకు తగ్గుతుంది. రోడ్డు పక్క కొబ్బరి బొండాలు మొదలు.. పెద్ద పెద్ద మాల్స్ వరకు ఎక్కడ ఎలాంటి కొనుగోలు చేసినా.. అన్నీ యూపీఐ పేమెంట్సే. అయితే ప్రతి చోటా మరీ ముఖ్యంగా ప్రయాణాల్లో కొన్ని సందర్భాల్లో సిగ్నల్ సరిగా రాదు. దాంతో యూపీఐ పేమెంట్స్ కష్టం అవుతుంది. ట్రైన్‌లో కొందరు చిరు వ్యాపారుల దగ్గర యూపీఐ పేమెంట్ సౌకర్యం అందుబాటులో ఉండదు. మరి అప్పుడు పరిస్థితి ఏంటి.. రైలు ప్రయాణంలో సడెన్‌గా డబ్బులు అవసరం పడితే ఎలా అంటే.. ఇదుగో సమాధానం.. దేశంలోనే తొలిసారి రైలులో ఏటీఎంని అందుబాటులోకి తీసుకువచ్చింది కేంద్ర రైల్వే శాఖ. ఇందుకోసం ముందగా ముంబై-మన్మాడ్ పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయోగాత్మకంగా ఈ కదిలే ఏటీఎంని ఇన్‌స్టాల్ చేసింది. రైలు ప్రయాణం సందర్భంగా ప్రయాణికులకు డబ్బులు విత్‌డ్రా చేసుకునే సౌకర్యం కల్పించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సెంట్రల్ రైల్వే తెలిపింది.

